# అనాధ

సాయంత్రం. ఠంగు ఠంగున నాలుగుగంటలు కొట్టింది. ఉత్సాహంగా వార్డు కిటికీ దగ్గరకు పరుగెత్తాను. డాక్టర్ యామిని కంఠస్వరం చెవిలో మారుమ్రోగింది—మళ్ళీ 'బెడ్ రెస్ట్ తీసుకోవాలి. కనీసం నెలరోజులైనా ఆస్పత్రిలో ఉండాలి' అని.

నెలరోజులే? అంటే ఇంకా ఇరవైతొమ్మిది రోజులు!

'ఇంటిదగ్గరుండే మీరు చెప్పిన మందులు తీసుకుంటాను డాక్టర్' అని కూడా అన్నాను. ఆవిడ వినిపించుకుంటేనా?

'అదేంకుదరదు లలితా. ఆస్పత్రిలో అయితే కట్టిపడేసి నట్లు విశ్రాంతి తీసుకుంటారుగానీ ఇంటిదగ్గరయితే, ఆ పనీ ఈపనీ చేస్తూనే ఉంటారు...'

నిస్సహాయంగా వారివైపు చూచాను. డాక్టర్ యామిని మాటలు తు.చ. తప్పకుండా ఆచరించాలనే నిర్ణయం కన్పిస్తున్నది.

'ఎంత త్వరగా చేరితే అంత మంచిది.' ఆవిడ స్టెత స్కోపు తీసుకొని వెళ్ళిపోయింది.

అప్పటికప్పడే ఇక్కడ బందీనయిపోయాను. ఇంటి దగ్గర బాబు, పాప 'అమ్మరాలేదేం?' అని ఏడ్చిఉంటారు కూడా!

మూడవ అంతస్తులో కిటికీదగ్గర నిల్చునిఉన్న నాకు ఆస్పత్రి గేటులోనుంచి త్రోసుకువస్తున్న జనసముదాయం చిన్న చిన్న బొమ్మల్లా కనిపిస్తున్నారు. ఎందరో తల్లులు, తండ్రులు, సోదరీ సోదరులు, భర్తలు, భార్యలు, రకరకాల బంధువర్గాలవారూ ఆతురతతో, ప్రేమతో, ఉత్సాహంతో తమ తమ రోగులకోసం పరుగెత్తుకు వస్తున్నారు. ప్రతిఒక్కరి చేతుల్లోనూ కారియరో, పొట్లాలో, మూటలో ఉన్నాయి తాహతునుబట్టి.

ఎంత విశాల ప్రపంచం! ఏ జన్మలోనో ఎవరి స్వేచ్ఛకో అడ్డువచ్చానేమో! ఏ తల్లి తండ్రుల బిడ్డలనో విడదీశానేమో! లేకుంటే హఠాత్తుగా నాకీ జబ్బేమిటి! బాబునూ, పాపనూ, వాళ్ల నాన్నగారినీ వదిలి నేనిక్కడ... ఈ ఆస్పత్రిలో ఇలా పడి ఉండటమేమిటి?

అరుగో! బాబు, పాప, వాళ్ళ నాన్నగారూ వస్తున్నారు. పాప, నాన్నగారిచెయ్యి పట్టుకొని చిన్నచిన్న అడుగులు వేస్తున్నది. సంశయాకులితచిత్తనైపోయాను. పాపం! పాపనలా ఇంటినుంచీ నడిపించుకు రావడం లేదుకదా వారు? కాళ్ళు నొప్పెడతాయో, ఏమో? ఇలా పాప నడకతో వాళ్ళు నా దగ్గరికి చేరుకునే సరికి ఆరుగంటలు కొడతారు. ఆ పుణ్యకాలం కాస్తా దాటిపోతుంది!

'మీవాళ్ళు వస్తున్నారా లలితగారూ?' పక్క బెడ్ రామలక్ష్మి అడుగుతున్నది.

'ఆ!' మళ్ళీ చూపు సారించాను. ఏరీ వాళ్లు?

'అమ్మా! అమ్మా!' ఉలిక్కిపడి తిరిగి చూచాను. పిల్లలు, వాళ్ల నాన్నగారు నా మంచం దగ్గర నిల్చుని ఉన్నారు.

ప్రాణం లేచివచ్చింది. పిల్లలిద్దరూ నా పక్కమీద కూర్చున్నారు. వాళ్ల ప్రాణానికి నేను వారిని వదిలి వచ్చి ఎన్నో సంవత్సరాలైనట్లుంది కాబోలు!...ఒకవేళ ఈ జబ్బు తగ్గక నేను చనిపోతే, వాళ్లిద్దరూ ఏమైపోతారో? ఛీ ఏమిటీ పాడు ఆలోచన?

'అబ్బ! ఈ పిల్లలతో చచ్చిపోయానంటే నమ్ము లలితా, పని తెమిలేసరికి!' వారు అలసటగా అంటున్నారు.

'మరి సామాన్యమనుకున్నారా? ఎంతకూ నా పని కాదని నన్నేవారుగా రోజూ?'

''అదికాదోయ్! అమ్మ దగ్గరికి పోదామని బాబు, అమ్మకావాలని పాప ఒకటే గొడవ చేశారు. లేకుంటే వెధవ పనిదోలెక్కా?'

'పోన్లెండి, ఎలాగూ ఓరోజు గడిచిపోతోంది. ఇక ఇరవై తొమ్మిది రోజులు...ఈలోపలే డిస్చార్జి చేయించు కుంటా ఎలాగో ఓలా...''

టైమయిపోయింది. వార్డులోని మిగతా రోగుల బంధువులందరూ వెళ్లుతున్నారు. పాప వెళ్ళనని మారాం చేస్తున్నది. 'అమ్మ! అమ్మ!' అంటూ సన్నగా ఏడుస్తున్నది.

'మళ్లీ వద్దాం పాపా !' వారు సముదాయిస్తున్నారు.

'అమ్మను కూడా రమ్మను నాన్నా.' బాబు ఏడు పెలాగో ఆపుకుంటూ అన్నాడు.

'మన వెనకనే అమ్మ రిక్షాలో వస్తుంది బాబూ !' వారు పిల్లలిద్దరినీ కబుర్లు చెబుతూ తీసుకువెళ్లుతున్నారు.

కళ్లలో నీళ్లు సుడులు తిరుగుతున్నాయి. క్షణమైనా ఇంటిదగ్గర నన్ను వదిలిఉండని వాళ్లు ఎలా ఉంటారు ? భగవాన్, ఏమిటీ శిక్ష !

సిస్టర్ వచ్చింది. 'మందు పుచ్చుకోండమ్మా' అంటున్నది.

కన్నీళ్లు ఆమెకు కనిపించకుండా చెయ్యటానికి విఫల ప్రయత్నం చేశాను. రాత్రి జరిగిపోతున్నది. నిద్ర రావడం లేదు. ఆలోచనా తరంగాలు పైన తిరుగుతున్న ఫాన్‌లా గిరగిర తిరుగుతున్నాయి వేగంగా...

బాబు మంచినీళ్ళకు లేస్తాడు ఏడుస్తూ. నిద్రమత్తులో వారు ఎలాగో తెచ్చిస్తారు. 'అమ్మకావాలి' అంటాడు. అసలే పగలంతా చేతరాని చాకిరీతో అలసిపోయిన వారికి చిరాకు వేస్తుంది వీడి ఏడుపు చూస్తుంటే. నాలుగంటిస్తారు. బాబు వెక్కిళ్లు పెడుతూ పడుకుంటాడు బోర్లా. పాప లేస్తుంది. 'పాలు' అంటుంది. 'పడుకో' - వారు కసురుకుంటారు. 'అమ్మా !' పెద్దగా ఏడుస్తుంది. 'పడుకోమంటూంటే ?' మళ్ళీ అరుస్తారు గట్టిగా. మరింతగా ఏడుస్తుంది పాప. అమ్మకు

తన ఏడు పెందుకు వినబడటంలేదో పాపకు తెలీదు. కాస్సే పటికి వారికే జాలివేస్తుంది. బాబును చిచ్చికొడతారు. పాపను బుజ్జగిస్తారు. 'భగవాన్ ! ఎందుకిలాటి కఠిన పరీక్ష పెట్టావు ? ఈ పసిపాపల క్షోభ నేపడలేను. మా లలితకు త్వరగా ఆరోగ్యం చేకూర్చు తండ్రీ !' అనుకుంటారు. 'లలితా ! త్వరగా రావూ ?' ఇల్లాగే ఆలోచిస్తూ నిద్రలేకుండా ఉంటారు. 'టక్' - చప్పుడయింది.

త్రుళ్ళిపడ్డాను. మంచంకింద ఏదో చప్పుడవుతున్నది. తొంగిచూచాను. ఎవరో పాప దోగాడుతూ మంచకింద తిరుగుతున్నది. ఆలోచనల మత్తు వదిలిపోయింది. ఎవరీపాప ? ఇక్కడికెలా వచ్చింది ? అసలిక్కడెక్కడా ఈ వయసు పిల్లలుండరే ? ఈ వార్డులో అసలు బిడ్డల తల్లులుండడానికే వీల్లేదు ! మరి ఎక్కడిదీ పాప ? మెల్లిగా పాపను మంచం కిందినుంచి పైకి తీసుకున్నాను. సుమారు రెండేళ్ళుంటాయి. తెల్లగా, సన్నగా, అందంగానే ఉంది. భయం భయంగా చూస్తున్నది నావైపు. చుట్టూ చూచాను. నాతోటి రోగులందరూ నిశ్చింతగా నిద్రపోతున్నారు. నైట్‌డ్యూటీ సిస్టర్ కూడా తల బల్లమీదపెట్టి, కుర్చీలోంచి వంగి నిద్రపోతున్నది.

రహస్యంగా అడిగాను-'పాపా ! అమ్మేది ?'

పాప భయంగా దిక్కులు చూస్తున్నది. ఎవరేనా మతిమరుపుతల్లి సాయంత్రం ఏరోగినో చూడడానికివచ్చి, వదిలి వెళ్ళలేదుగదా ? పాపకు మాటలుకూడా రానట్లుంది. పాప నెత్తుకొని సిస్టర్ దగ్గరకు వెళ్ళాను.

'సిస్టర్! సిస్టర్!'

ఉలిక్కిపడి లేచింది.

'ఏమిటమ్మా?'

'ఈపాప ఎవరో నా మంచం దగ్గరకొచ్చింది'

'అదా? ఇంకా ఏమో అనుకున్నాను. దానికి నిద్ర రాదు. బ్రహ్మరాక్షసి. తెల్లవార్లూ ఇలాగే తిరుగుతుంటుంది... ఇలా తే. ఆయాలకిచ్చి వస్తాను.'

విసురుగా నా చేతిలోంచి పాపను లాక్కు వెళ్ళిపోయింది సిస్టర్. ద్రిమ్మెరపడిపోయాను. ఎవరా పాప? ఆ సిస్టరెందుకలా విసుక్కుంటున్నది? ఏమీ అంతుబట్టలేదు. రాబోతున్న నిద్ర కూడా వెనక్కు వెళ్ళిపోయింది.

* * * *

'రాత్రి బాగా నిద్రపట్టిందా లలితా?' డాక్టర్ యామిని అడుగుతున్నది. తలూపాను.

'పిల్లల్నీ, వాళ్ళ నాన్నగార్నీ గురించి బెంగపెట్టుకోలేదు గదా?' ఆవిడ నవ్వుతున్నది.

శుష్కహాసం చేయబోయాను...హఠాత్తుగా నా దృష్టి దూరాన ఒక రోగి మంచక్రింద పడిన ద్రాక్షపళ్ళు తింటున్న పాపమీద పడింది. రాత్రి నే చూచిన పాపే!

'డాక్టర్ ఆ పాప...' అనబోయాను.

యామిని క్షణం అటువేపు చూచి నవ్వింది.

'సరోజా ? అదంతే. ఎవరేం పెట్టినా తింటుంది.' ఆవిడ కదిలివెళ్లిపోయింది. పాపపేరు సరోజ అన్నమాట.

ఇంజక్షన్ చేయటానికి హౌస్‌సర్జన్ ఒకావిడ వస్తున్నది. దోవలో సరోజ కూర్చుని చప్పట్లు చరుచుకుంటున్నది.

'ఛ. డర్టీ క్రీచర్. ఎక్కడ చూచినా నువ్వే!' ఒక చేత్తోలాగి పక్కన కూలేసింది, నిర్జీవవస్తువునులా.

గుడ్లనిండా నీరు కుక్కుకుని బిత్తరపోయి చూస్తున్నది సరోజ.

'దీని నెందుకిలా తిరగనిస్తారు సిస్టర్ ?' అదే హుందాతో అడుగుతున్నది ఆ కాబోయే లేడీడాక్టర్.

'ఏం చెయ్యమంటారండీ ? ఒకచోట ఉంటేగా ? ఎన్ని మార్లారూములో పారేసినా, మళ్లీ బయటికి వస్తుంది.' సిస్టర్ చిరచిరలాడుతు లాక్కు వెళ్లింది పాపను.

ఎవరికీ సంబంధించనిదా పాప. అందరికీ అసహ్యమే. చిరాకే. ఎందుకనో ? డాక్టర్లందరూ వెళ్లిపోయారు. నర్సులూ వెళ్లారు భోజనాలకు. పక్కబెడ్ రామలక్ష్మికేసి చూచాను. ఆరవసారి టిఫిన్ తింటున్నది. లాభం లేదు. ఇప్పుడడిగినా ఆమె చెప్పలేదేమో !

'ఏమిటలా చూస్తున్నారు ? మీకాకలి కావటంలేదూ ? నాకాశ్చర్యంగా ఉంది మిమ్మల్ని చూస్తుంటే. ఉదయమనగా కాస్తటిఫినూ, కాఫీ పుచ్చుకున్నారు. ఇందాక భోజనం చేశారు. అంతే. ఈ లోపల ఆహారం ఏమీ పుచ్చుకోలేదు

గదా? మీ కాకలి కాలేదేమిటి?' అంది రామలక్ష్మి నన్నో వింతమృగాన్నిలా చూస్తూ.

'ఆపాప ఎవరో మీకు తెలుసా?' అడిగాను వీలుచిక్కగానే.

'ఆ! ఎవరో కనిపారేసి వెళ్లారు.' ఒక్కముక్కలో తేల్చేసింది మరోపొట్లం విప్పుకుంటూ.

'అంటే?'

'అంటే ఎవరో ఎక్కడో కని, ఈ పాపని ఆస్పత్రి స్నానాల గదిలో పారేసి వెళ్లిపోయిందిట రెండేళ్ళక్రితం. ఆస్పత్రి నౌకర్లు చూచి, సూపరింటెండెంటుకు తెల్పితే, అప్పట్నుంచీ ఇక్కడే పెంచుతున్నారు దీన్ని.'

'ఎవరు పెంచుతున్నారు?' పిచ్చి ప్రశ్న అనికూడా తోచలేదు.

'అందరూ. నర్సులూ, డాక్టర్లు, రోగులు, ఆయాలు, వచ్చే పోయేవాళ్లూ అంతాను.'

చెబుతూన్న రామలక్ష్మికే ఊహ పోయిందో, గబగబ లేచివెళ్లి తను తింటూన్న ఫలహారం కాస్త అక్కడే తిరుగుతున్న పాప నోట్లో వేసింది.

'ఛ. ఛ. ఏమిటది? అలా మన ఎంగిలిపెడితే, పాపం ఆ పాపకు జబ్బు చెయ్యదూ?' ఉండబట్టలేక అడిగాను.

'ఊహూఁ! ఏమీ చెయ్యదు. అందరూ పెడతారు. ఇష్టకుంటే అదే ఏరుకుని తింటుంది.' సరోజకు పొరబోయింది. నోట్లో పదార్థం గుండెలమీదా, పొట్టమీదా పడింది.

'ఛ, అలా ఉమ్మేస్తావేం?' ఓపిక చేసుకు లేచివెళ్ళి రెండు తగిలించింది. రామలక్ష్మి.

ఆ రెండు దెబ్బలూ సరోజ వీపుమీద కాదు ... నా హృదయంమీదే పడ్డాయి.

'అమ్మా!' అంటూ ఏడుస్తోంది సరోజ దిక్కులుచూస్తూ.

దిగ్గున లేచి వెళ్ళాను. హృదయానికి హత్తుకున్నాను.

'అమ్మా!' హృదయ విదారకరమైన ఆ పసిపాప పిలుపుకు పలికే 'అమ్మ' ఎవరు? తలిదండ్రులులేని పిల్ల. తల్లికి పనికిరాని పిల్ల, ఆ ఇద్దరూ చేసిన తప్పుకూ, పాపానికీ సాక్షీభూతమైన పాప. ఆ తల్లిదెంత వజ్రసంకాసహృదయమో! క్షణకాలం ఆలోచించిందా, తాను పరిత్యజించేముందు? ఈ నాడు ఈ దృశ్యాన్ని ఒక్కసారిచూస్తే, కనీసం ఊహించి ఉంటే అలాపారేసి వెళ్ళేదా?

సరోజ ఏడుపుమానేసింది. నా వేపు ఆశ్చర్యంగాచూస్తున్నది.

'బిస్కట్ తింటావా సరూ?'

బిస్కట్ తీసిపెట్టాను. నా బెడ్ మీదకూర్చుని తింటోంది. పదేపదే ఆ చిన్నారి కన్నుల్ల[illegible]ంత కనిపిస్తున్నది. బహుశా ఇంతక్రితమెవరూ ఇలా బుజ్జగించలేదేమో! కాస్సేపటికి అల్లాగే పడుకొని నిద్రపోయింది. టవల్ కప్పాను.

'మీకు పిల్లల్లేరా ఏమిటీ, దాన్నలా దగ్గరకు తీశారు?' దూరంగాఉన్న బెడ్ మీదున్న కనకసుందరి ఖంగున ప్రశ్నిస్తున్నది.

చటుక్కున చుట్టూ తలెత్తి చూచాను. దాదాపు వార్డులో వారంతా నావేపు వింతగా చూస్తున్నారు. ఏదో చేయరానిపని చేస్తున్నట్లున్నాయి ఆ చూపులు.

సాయంత్రం వారు, పిల్లలు వచ్చారు. సందడికి సరోజ లేచింది.

'ఎవరీపాప ?' వారడిగారు. చెప్పాను.

'పాపం !' అన్నారు.

వెళుతూ వెళుతూ సరోజ కోసం బిస్కెట్లిచ్చి వెళ్లారు.

'అమ్మా, ఈ పాపనుకూడ మనంతీసుకొందామా ?' బాబు ప్రశ్న నాహృదయాంతరాళాల్లో మారుమ్రోగు తున్నది.

సరోజ ఎక్కడికో వెళ్లిపోయింది. ఎవరికో ముద్దొచ్చి చంకనేసుకు వెళ్లారట.

రాత్రి గడుస్తున్నది. నిద్ర దూరమయింది. ఇంటిదగ్గరే హాయిగా ఉండేది. పగలంతా శ్రమపడినా, రాత్రిళ్ళు నిశ్చింతగా నిద్రపోయేదాన్ని. స్నానాలగదివేపు నడిచాను. అక్కడసలు లైటు లేదు. కాలికేదో మెత్తగా తగిలింది. వంగి చూచాను, చేత్తో తడుముతూ సరోజ! ఆ తడిలో, గలీజుగా ఉన్నచోట పడుకొని నిద్రపోతున్నది. గుండెలు పిండినట్లయ్యింది. ఎంత క్రూరాత్మురాలా తల్లి ! భుజం మీద వేసుక వచ్చి పడుకోబెట్టుకున్నాను.

ఆయా వచ్చింది కాస్సేపటికి. 'ఏదీ అది ? ఓ! మీ దగ్గరుందామ్మా ? నా పక్కన లేకుంటే, ఏ మెట్లమీద నుంచో దూకి వచ్చింది కాబోలని హడలి చచ్చాను' అంది.

'బాత్ రూం దగ్గర పడుకొని నిద్రపోతోంది పాపం...'

'దానిబతుకంతే. తల్లి అక్కడేగా పారేసెళ్లిందీ ? మొన్నోసారి సూపర్నెంటు తనికీకొచ్చాడు. మెట్లమీదనుంచి పడి గాయం చేసుకుందిది. దాంతో అందర్నీ కేకలేశాడు చూళ్ళేదని. పాడుపిల్ల ! తను పడి మాకు చీవాట్లు తెస్తుంది.'

సరోజను భుజాన విసురుగా వేసుకుని వెళ్లింది ఆయా.

అస్తమానూ సరోజ నాదగ్గరే తారట్లాడుతున్నది. ఇంతకు ముందులా బుంగమూతి పెట్టుకొని కూర్చోవడంలేదు. ఆ చిన్నికళ్ళల్లో వింత వెలుగు కన్పిస్తున్నది. ఏ నర్సో జ్ఞాపకంవచ్చి, రొట్టె, పాలు ఇవ్వగానే దోగాడుతూ నా దగ్గరకు పరుగెత్తుకు వస్తున్నది. నడక రాలేదు.

సాయంత్రం వారు వస్తూ చిన్నగౌను కొని తెచ్చారు. సరోజకు తొడిగాను. కొత్త గౌనులో సరూ ఎంతో అందంగా ఉంది. నైట్ డ్యూటీ సిస్టర్లు అంతా పోగయ్యారు. స్టాఫ్ నర్సుకూడా మంచి చలాకీ మనిషిలా ఉంది. అందరితో నవ్వుతూ కులాసాగా కబుర్లు చెబుతున్నది. సరోజ పక్కగా వెళ్ళుతున్నది.

'సరూ ! రామ్మా !' ఒక సిస్టర్ ముద్దుగా ఎత్తుకుంది.

'అమ్మేది సరూ, మీ అమ్మేదీ ?' అడిగింది స్టాఫ్ నర్సు. సరోజమల్లీ చుట్టూ కలయచూస్తున్నది.

'లేదు. లేదు. నీకు అమ్మలేదు' - మరో సిస్టర్ చేయితిప్పుతూ తనభాష ఆపాపకు అర్థమయ్యేలా చెబుతున్నది.

సరోజ బిక్కమొగం వేసింది. తళుక్కుమని సరూ చూపు ఒకసారి నామీద పడి మరలింది.

'అమ్మ' అంటున్నది. అమ్మలేని ఆ పాపకు 'అమ్మ' అనడం మాత్రం తెలుసు. అమ్మెవరో ఏం తెలుసు ?

'అదో ఆ ఏడుపు మొహమే పెట్టొద్దన్నాను...' స్టాఫ్ నర్సు సరోజ బుగ్గమీద గిల్లేసింది. 'అమ్మా !' సరోజ పెద్దగా ఏడుస్తున్నది.

'పక్షీ ! కాస్సేపయినా నవ్వవుకదా ?' స్టాఫ్ నర్సు తన చేతుల్లోకి లాక్కుంది.

సరోజ ఏడుస్తున్నది. ఆమె నవ్వుతున్నది. 'బాగా ఏడు. గట్టిగా ఏడు. ముద్దు' అంటున్నది నవ్వుతూనే.

సరోజ వెక్కిళ్ళు పెడుతున్నది. వార్డులో అంతా సినిమాలా చూస్తున్నారు ఆ దృశ్యాన్ని చిరునవ్వులతో. సరోజ ఆమె చేతుల్లోంచి గింజుకుంటున్నది.

'ముద్దు. కూర్చో.' కింద వదిలేసి వెళ్ళింది స్టాఫ్ నర్సు.

అంతా అనుసరించారు. ఊపిరి బిగబట్టుకుని ఉన్న నాకు ఒక్కసారిగా వెయ్యేనుగుల బలం వచ్చింది. పరుగెత్తుకు వెళ్లి సరోజ నెత్తుక వచ్చాను.

'ఎందుకమ్మా సరూ ? ఏడవకు.' సరోజ కన్నీళ్లతో నా పమిటంతా తడిసిపోయింది.

అలసి నిద్రపోయింది సరోజ. పడుకోబెట్టాను. అనుకోకుండా కళ్లు సరూ తొడమీద పడ్డాయి. తొడంతా కంది, దద్దురుకట్టిఉంది. సరోజ నర్సు చేతుల్లో తన్నుకుంటున్న దృశ్యం మెదిలింది. నవ్వుతూన్న ఆ నర్సు ముఖం దెయ్యం ముఖంలా వికృతంగా కన్పించింది.

'సరూ ! పిచ్చితల్లీ ! ఇలాంటి ఎందరు క్రూరుల చేతుల్లో నువ్వు పెరగాలో !'

ప్రశాంతంగా నిద్రిస్తున్న ఆ పసిపాప కేం తెలుసు నా ఆవేదన ?

అత్తయ్య వస్తున్నదనీ; తనూ, పిల్లలూ స్టేషనుకు వెళ్ళుతున్నామనీ; ఆస్పత్రి కీరోజు రావడానికి వీలుపడదనీ కబురు చేశారు వారు. ఏమీ తోచలేదు. వార్డులన్నీ దాటి, ఆరుబయటికి వచ్చాను. డాక్టర్ యామిని అటే వెళ్ళుతున్నది ఒంటరిగా.

'డాక్టర్ !' పిలిచాను.

'ఏమ్మా ? ఏం కావాలి ?' యామిని వచ్చింది.

'కాస్సేపు మాట్లాడడానికి వీలౌతుందా ?'

'తప్పకుండా ! పనేమీ లేకే ఇక్కడికి వచ్చాను నేను.'

'డాక్టర్, సరోజనలా హింసిస్తారెందుకూ అంతా ? పోనీ ఎవరేనా పెంచుకునేవాళ్ళ కివ్వగూడదూ ?'

నిన్నరాత్రి నే చూచిన దృశ్యంతోసహా అన్నీ ఏకరువు మనసులో ఉన్నమాట అడిగేశాను.

'ఎవరూ పెంచుకోరు లలితా!' యామిని నిట్టూర్చింది.

'ఎందుకని?'

'మొదటిది : తల్లికే బరువయినబిడ్డ, అందరికీ బరువే! ఇక రెండోది : ఆస్పత్రి నిబంధనలు.'

'ఆ పాప పోషణకూ, చదువుకూ, జీవితంలో స్థిరపడే వరకూ—అంటే మైనారిటీ తీరేవరకూ కావలసిన ఆస్తి ఇంత అని నిర్ణయిస్తుంది ఆస్పత్రి కమిటీ. అది ఆ పాపపేరిట ముందే రిజిస్టర్ చేసి ఆస్పత్రి అధికారుల కివ్వాలి పెంచుకోదలచినవారు. ఆ తర్వాత అధికారులు ఒప్పుకోవాలి. ఆ తర్వాత జిల్లా కలెక్టరూ వగైరాల దగ్గర సర్టిఫికేట్ తెచ్చుకోవాలి...ఇంకా ఇంకా ఇలాటివే ఎన్నో...'

నేను ఆలోచిస్తు ఉండిపోయాను.

'పైగా కులగోత్రాలులేని ఆ పాపను పెంచుకోడానికి చాలామంది సాహసించరు...'

వార్డులోకి వచ్చేశాను. మంచంకోడు దగ్గర సరోజ కూర్చుని ఉంది! మాతృప్రేమ తెలియని ఆ పాపకు అనురాగాన్ని చవిచూపించాను ఊరుకోకుండా. రేపు నే వెళ్ళిపోతే? ఒకసారయినా అనురాగాన్ని, వాత్సల్యాన్నీ రుచి చూచిన ఆ లేత హృదయం అందుకోసం ఇంకా ఆరాటపడుతుందేమో? ఎందుకిలా దగ్గరకు తీశాను? సరోజలో లేని

పోని ఆశలు అన్ని ఎందుకు కల్పించాను? సరోజ నా కాళ్ళు పట్టుక లేచినిల్చుంది. చీరకుచ్చెళ్లతో 'బూచి' ఆడుతున్నది నవ్వుతూ. కళ్ళు వర్షించాయి.

రాత్రి పడుకున్నాను. మహాలక్ష్మమ్మపిన్ని మదిలో మెదిలింది. కావలసినంత కలిమి. పిల్లల్లేరనే బెంగ. ఆవిడకు తెలిస్తే తప్పకుండా పెంచుకుంటుంది. ఎంతయినా, పిల్లల్లేరనే మమకారం కొద్దీ, పిన్ని సరోజను ప్రేమగా చూస్తుంది. ఈ పాషాణహృదయుల కబంధ హస్తాల్లోంచి బయటపడుతుంది సరోజ. అంతేచాలు. పిన్నికి కబురు చేశాను. పిన్ని రాగానే చెప్పేశాను.

'నువ్వు తల్చుకుంటే ఆస్తికేం?' అన్నాను. సరోజను పిన్ని కందివ్వబోతూ.

వింటూన్న పిన్ని ఒక అడుగు వెనక్కు వెళ్లింది. సరోజ దబ్బున కింద పడేదే. పట్టుకున్నాను.

'బాగుందే నీ సలహా! తెద్దునాకి వ్రతం చెరచుకుందిట వెనకటికో ఇల్లాలు. పిల్లల్లేకుంటే పీడాపాయె. ఎవత్తో నీతీ, జాతీ లేకుండా కనిపారేసిన ఈ పాడు పిల్లని పెంచుకోమంటావ్? పైగా దీనిక్కావల్సిన ఆస్తి రిజిష్టరు చెయ్యాలిట! ఇంతోటి పాపపుమాట మరెక్కడా దొరకదనా?

'తండ్రి ఎవరో తెలీదు. తల్లి సరేసరి! కన్నబిడ్డనే పారేసింది. దీనికి మాత్రం ఆ పోలికలు రావని ఏం గురి?' పిన్ని మాట్లాడుతున్నది.

మా పాపతో ఆడుకుంటున్న సరోజ, పాపచేతిలో బిస్కెట్టు లాక్కుంది.

'ఛీ వెధవపిల్లా! దానిచేతిలో లాక్కుంటావేమే? అయినా ఆ కుక్కబుద్ధు లెక్కడికి పోతాయి?' పిన్ని చూపులలో శక్తి ఉంటే సరోజ భస్మమయి పోయేదే.

బాబూ, వాళ్ల నాన్నగారు, అత్తయ్యా వచ్చారు. బాబు పాపచేతిలో బిస్కెట్టు లాక్కున్నాడు.

'అల్లరి కృష్ణుడమ్మా! ఎలా లాక్కున్నాడో చూడు బంగారు నాయన!' పిన్ని బాబును ముద్దు పెట్టుకుంటున్నది.

తల్లి ఉనికే బిడ్డలకు శ్రీరామరక్ష కాబోలు! నే లేకుంటే బాబుది కుక్కబుద్ధి అయ్యేదికాదూ? ఛీ ఏం మనిషి, ఏం ప్రపంచం? పిన్నీ, అత్తయ్యా వెళ్ళిపోయారు.

'పోనీ మనమే తీసుకుందాం!' అన్నాను వారితో. కానీ నాకూ తెలుసు అది అసాధ్యమని. వారు శుష్కహాసం చేశారు.

'కొందరికి అన్ని విధాలా శక్తి ఉన్నా మంచి పనిచేసే సహృదయం ఉండదు. చేసే సద్బుద్ధిఉన్నా, మనబోటి వాళ్లకు శక్తి ఇవ్వడు భగవంతుడు. కొన్ని పరిష్కారంలేని సమస్యలు లలితా! నీ కళ్లెదురుగా చూస్తున్నావు కాబట్టె, సరోజను గురించి రాత్రింబగళ్ళు విచారిస్తున్నావు కానీ, ఈ విశాల ప్రపంచంలో ఇలా తలిదండ్రుల పాపానికి ప్రతిఫలంగా శిక్ష ననుభవిస్తున్న అనాథ లెందరున్నారో తెలుసా? వాళ్ళం

దరినీ ఎవరు పెంచుకుంటారు? ఎవరు కాపాడుతారు? ఎవ రాదరిస్తారు? ఆ అనాథలు అలాగే చస్తూ బ్రతుకుతున్నారు; పెరుగుతున్నారు; జీవచ్ఛవాల్లా! సమాజానికి చీడపురుగుల్లా కొందరు తయారౌతున్నారు. ఎందుకని? వారి కెవరి బాధ్యతాలేదు. క్రమశిక్షణాలేదు. అనురాగమూ, సాను భూతీలేవు...ఈ సమస్యకసలు పరిష్కార మేముందీ?'

వా రింకా చెబుతున్నారు.

'నువ్వీ ఆస్పత్రినుంచి బయటికి వచ్చేసరికి నాలుగు వందలు అప్పులో ఉంటాం. దేవుడు మనకిచ్చిన ఆస్తి ఈ అప్పులేకదా? నా జీతం డబ్బుతో ఎలాగో సంసారాన్ని నెట్టాలి...ఏ ఆస్తి చూపిద్దాం సరోజకు?'

నిజమే. వారు చెప్పింది అక్షరాలా నిజం. డబ్బుతో ఎన్ని ఘోరాలయినా కప్పిపెట్టడానికి సాహసించగలవారు కూడా పరువు, ప్రతిష్ఠలనే తెరలు అడ్డుపెట్టుకుంటారు ఈ అనాథల విషయంలో. ఆలోచించి బాధపడే నా కేముందీ? డబ్బులేదు. పెంచగల స్తోమత లేదు. పెంచినా, సమాజంలో సరోజకు నా బిడ్డతోపాటు స్థానాన్ని కల్పించగల శక్తిలేదు!

సాయంత్రం వెళ్ళిపోతున్నాను.

'జాగ్రత్త లలితా! ఇంటి కెళ్ళాంగదా అని శక్తికి మించిన పనులు చెయ్యొద్దు. మళ్ళీ ఆరోగ్యం దెబ్బతినకుండా కాపాడుకోవాలి.' డాక్టర్ యామిని హెచ్చరిస్తున్నది. సిస్టర్లు అందరికీ కృతజ్ఞత తెలిపాను. కళ్లు పరిసరాలను పరికిస్తు న్నాయి. సరోజ ఏదీ? దూరంగా మెట్ల దగ్గర ఒక ఆయా

చంకలో సరోజ కూర్చుని ఉంది. మెట్లు దిగి వచ్చాను. నన్ను చూడగానే సరోజ ముఖం వికసించింది.

'దా సరూ !' పిలిచానో లేదో దూకింది.

'సరూ ! వెళ్తున్నానమ్మా ! ఇక ఇక్కడికి నే రాను. నువ్వు నా దగ్గరకు రావు...' కంఠం పూడుకుపోతున్నది.

సరోజ పిచ్చిగా నవ్వుతూ నా చెంపలను రాస్తున్నది తన చిన్ని చేతులతో.

'వెళ్దాం రామ్మా !' బాబు, పాపలు చెయ్యి పట్టుక లాగుతున్నారు. వాళ్ళకళ్లల్లో వేయి వెలుగులు. వాళ్ల ఆనందానికి హద్దుల్లేవు.

రిక్షా గేటులో ఆగిఉంది. సరోజను ఆయా చేతికిచ్చాను. రిక్షా కదిలింది. తిరిగి చూచాను. సరోజ ఆయా చేతుల్లో ఏడుస్తున్నది. 'అమ్మా, అమ్మా !' అంటున్నది నావేపు చూపిస్తూ. హృదయం వేదనాభరితమైంది. కన్నీళ్ళ తెర అడ్డువచ్చి, ఆస్పత్రి కనుమరుగైంది.

*   *   *   *

రాత్రి పొద్దు పోతున్నది. పాప నన్ను చుట్టుకు పోయింది. చటుక్కున సరోజ గుర్తుకు వచ్చింది. నా బెడ్ మీది కెవరో మరోరోగి వచ్చిఉంటుంది. రోజూలానే సరోజ అక్కడికి వస్తుంది. 'ఛీ ఎవరీ పాడు పిల్ల' అంటూ కసురుకుంటుందామె. సిస్టర్‌కు చెబుతుంది. రెండు దెబ్బలు వేసి లాక్కువెళ్ళి రూములో పడేస్తుంది సిస్టర్. 'అమ్మా !

అమ్మా !' ఏడ్చి ఏడ్చి ఎక్కడో నేలమీద పడి, అలసి నిద్ర పోతుంది పిచ్చిసరూ. భూమాత ఆదరిస్తుంది. ఆశ్రయమిస్తుంది. అంతే !

ఎదురుగా గోడకు తగిలించి ఉన్న ఫోటోలో జగజ్జనని నిర్మలంగా నవ్వుతున్నది. హృదయం ఆక్రోశిస్తున్నది.

'తల్లీ, అమ్మల గన్న అమ్మవు. అమ్మలో సహజమైన అనురాగాన్నెందుకు ఇలా తెంచేస్తావు ? తన బిడ్డలను అనాథలుగా చేసేంత క్రూరత్వాన్నెందుకు కల్పిస్తావమ్మా ? పురుషులలో కాఠిన్యం ఉంటే ఉండుగాక ! కానీ నీ అంశలయిన స్త్రీలలోకూడా ఆ అనాథలపట్ల కారుణ్యం లేదెందుకని ?'

కళ్ళు జలపాతాలవుతున్నాయి. ఆగకుండా పొంగి ప్రవహిస్తున్నాయి కన్నీళ్ళు.

'అమ్మా ! నాకెందుకీ చేతరాని కన్నీళ్లు ? కనీసం నా యీ ప్రతికన్నీటి బొట్టుకూ ఒక్కో అనాథను రక్షించగలిగే శక్తి ఇవ్వు. చాలు. జీవితాంతం నిర్విరామంగా ఏడుస్తాను. కన్నీళ్లు కారుస్తాను. నా కదే ఆనందం తల్లీ !'